భారత్-జపాన్.. వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలు

1957... జపాన్‌ను శత్రుదేశంగా చూస్తున్న రోజులవి. అయినా, ఆ దేశ ప్రధాన మంత్రి నొబుసుకె కిషికి భారత్ సాదర స్వాగతం పలికింది. ఆసియాలోని దేశాలన్నీ జపాన్‌ను దూరం పెట్టినా... అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆ దేశానికి సముచిత స్థానం దక్కాల్సిందేనని అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గట్టిగా కోరారు. నాడు భారత్ చూపిన ఔదార్యం... నేడు రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు పునాదని చెప్పాచ్చు! మారిన అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో.... అంతర్జాతీయ వ్యవహారాల్లో అధికార కేంద్రం... పశ్చిమ దేశాల నుంచి తూర్పు దేశాలకు మారడం ఖాయమనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో ఆసియా ఖండంలోని భారత్, చైనాలు శక్తిమంత దేశాలుగా ఎదుగుతున్నాయి. మరోవైపు ఆసియాలో మరో బలమైన ఆర్థిక వ్యవస్థ జపాన్ కూడా ప్రపంచ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనుంది!!

శరవేగంగా మారుతున్న అంతర్జాతీయ సంబంధాలకు కేంద్ర బిందువు.. ఆసియా. ఈ నేపథ్యంలో భారత్, చైనా, జపాన్‌ల మధ్యసంబంధాలు... ఆసియా భద్రత, శాంతి, అభివృద్ధిపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. రాజకీయ, భద్రత అంశాల పరంగాచూస్తే... భారత్, జపాన్‌ల మధ్య ఎలాంటి వివాదంలేదు. రెండు దేశాలకు చైనాతో సంక్లిష్టమైన సరిహద్దు సమస్య ఉంది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు జపాన్ అత్యంత ప్రాధాన్యంఇస్తుందని జపాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి టొమొహికో తానిగుచిఅన్నారు. తద్వారా రెండు దేశాలు వ్యూహాత్మక, భాగస్వామ్య సంబంధాల దిశగా కలిసి పనిచేయొచ్చన్నారు. భారత్, జపాన్ ఇప్పటికే అంతర్జాతీయ వ్యూహాత్మక, భాగస్వామ్య సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యం అంటే.. అంతర్జాతీయ అంశాలపై చర్చించడం.. వ్యూహాత్మక భాగస్వామ్యం అంటే.. ద్వైపాక్షికంగా సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం. ద్వైపాక్షిక ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై భారత్, జపాన్ చర్చలు జరుపుతున్నాయి. ఉగ్రవాద వ్యతిరేక, దోపిడీ దొంగల వ్యతిరేక చర్యల్లో భాగంగా.. సముద్రతీర ప్రాంత భద్రత కోసం అమెరికా, ఆస్ట్రేలియాతోపాటు భారత్ కూడా కలిసిరావాలని జపాన్ కోరుతోంది. 2006, మేలో భారత రక్షణ మంత్రి, జపాన్ పర్యటన సందర్భంగా రక్షణ రంగంపై చర్చలకు రెండు దేశాలు అంగీకరించాయని భారత విదేశాంగ కార్యదర్శి శివ శంకర్ మీనన్ తెలిపారు. ఇరు దేశాల తీర ప్రాంత గస్తీ దళాలు ఇప్పటికే ప్రతిఏటా సైనిక విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. ఆ మేరకు 2006, నవంబర్‌లో రెండు దేశాల మధ్య 'మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్'(ఎంవో యూ) జరిగింది. జపాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలకు భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ తెలిపారు. భారత్-జపాన్ మధ్య పటిష్ట సంబంధాలు.. ఆసియా భద్రతలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతకు, ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. జపాన్ అప్పటి ప్రధాన మంత్రి జునిచిరో కొయిజుమీ 2005, ఏప్రిల్‌లో భారత్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా ఉమ్మడి ప్రకటన, ఎనిమిది అంశాల కార్యాచరణపై

నే ప్రధానంగా దృష్టిసారించడం జరిగింది. రెండు దేశాల మధ్య ఎలాంటి ఒప్పందాలు ఖరారు కాలేదు.

ఉమ్మడి ప్రకటన:

రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాల పటిష్టత లక్ష్యంగా.. జపాన్ నాటి ప్రధానమంత్రి కొయిజుమీ భారత పర్యటన కొనసాగింది. మన్మోహన్ సింగ్, కొయిజుమీల మధ్య చర్చల అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన విడుదలైంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో పెరుగుతున్న ఆసియా పాత్ర.. అంతర్జాతీయ వ్యవహారాలపై దాని ప్రభావాన్ని ఆ ప్రకటనలో రెండు దేశాలు గుర్తించాయి. ఆసియాలో సంభవిస్తున్న సానుకూల పరిణామాలపట్ల ఇరు దేశాల నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి మంచి భవిష్యత్ ఉంటుందన్న విశ్వాసం కూడా ఉమ్మడి ప్రకటనలో వ్యక్తమైంది. ఆసియాలో శాంతి, సుస్థిరతలు, భద్రతను పెంపొందించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. ప్రాంతీయ సుస్థిరత కోసం పనిచేయాలని ఇద్దరు నేతలు అంగీకరించారు. దీర్ఘకాలిక రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు, లక్ష్యాలను రెండు దేశాల మధ్య అంతర్జా తీయ భాగస్వామ్య చర్చలు ప్రతిబింబించాలన్నారు. జాతీయ భద్రతా సలహాదారు ఎం.కె.నారాయణ్, జపాన్ ప్రధాని దౌత్య సలహాదారు యురికో కవగుచిల మధ్య ఉన్నతస్థాయి వ్యూహాత్మక చర్చల్లో.. ఇంధన భద్రత, తీరగస్తీ అంశాలను చేర్చాలని నిర్ణయించారు. జనహనన ఆయుధాల (వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్-డబ్ల్యూఎండీ) వ్యాప్తి నిరోధం విషయంలో... భారత్, జపాన్ భాగస్వామ్యదేశాలుగా కలిసి పనిచేయాలని నిశ్చయించారు. ఆర్థిక సంబంధాలను పటిష్టపరిచేందుకు ఉద్దేశించిన 'ఉమ్మడి అధ్యయన బృందం' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇది ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం సాధ్యాసాధ్యాలపై చర్చిస్తుంది. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణల ఆవశ్యకతనూ ఉమ్మడి ప్రకటనలో ప్రస్తావించారు.

ఎనిమిది అంశాల కార్యాచరణ:

- ద్వైపాక్షిక చర్చల ప్రక్రియను వేగవంతం చేయడం.
- వాణిజ్యం, పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడం.
- భద్రతపై సహకార చర్చలు.
- సైన్స్ అండ్ టెక్నాలజీపై కార్యాచరణ.
- ఆసియాలో కొత్త శకానికి సహకారం.
- ఐక్యరాజ్యసమితిలో, ఇతర అంతర్జాతీయ సంస్థల్లో సహకరించుకోవడం.
- అంతర్జాతీయ సవాళ్లు, అవకాశాల విషయంలో సహకారం.
- ప్రజల మధ్య సంబంధాలకు కృషిచేయడం.

స్నేహ రాగాలు.... కారణాలు:

భారత్‌ను జపాన్ కీలక మిత్ర దేశంగా భావిస్తోందనడానికి ఆ దేశ ప్రధాని ఢిల్లీ పర్యటనే నిదర్శనమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. చైనాతో సంబంధాలు అంత సజావుగా లేకపోవడం కూడా భారత్‌వైపు జపాన్ చూడడానికి కారణమంటున్నారు. అన్ని దేశాలతో సంబంధాల్ని పటిష్టపరచుకోవాలనే తన విధానంలో భాగంగానే జపాన్‌తో భారత్ ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగిస్తోంది. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో కీలకంగా మారడంలో.. అంతర్జాతీయంగా ప్రధాన పాత్ర పోషించడంలో.. ప్రాంతీయంగా పటిష్ట సంబంధాలు భారత్‌కు తోడ్పడతాయి. కొయిజుమీ భారత పర్యటన సందర్భంగా ఆర్థిక సంబంధాలను మరింత పటిష్టపరచుకోవాలని రెండు దేశాలు నిర్ణయించాయి. వచ్చే ఐదేళ్లలో రెండు దేశాల మధ్య వాణిజ్య లక్ష్యం 4 బిలియన్ డాలర్లుగా నిర్దేశించారు. భారీ మౌలికవసతుల ప్రాజెక్టుల్లో భారత్‌కు జపాన్ సహకరిస్తోంది.

జపాన్‌లో మన్మోహన్ పర్యటన:

భారత ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ 2008, అక్టోబరులో జపాన్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా భద్రత, సహకారంపై రెండు దేశాలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.

ముఖ్యాంశాలు....

- విపత్తుల నిర్వహణ, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, పైరసీ, ఆయుధాల వ్యాప్తి నియంత్రణ, సంయుక్త విన్యాసాలు తదితర అంశాలను ఉమ్మడి ప్రకటనలో ప్రస్తావించారు.
- రెండు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న రక్షణ సంబంధాలను మరింత వేగవంతం చేయాలి.
- రక్షణ సంబంధాలను క్రమేణా విస్తరించడం ద్వారా ఆసియాలో భద్రత పరిధిని ప్రభావితం చేయాలి.
- ప్రాంతీయ భద్రతకు తమ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఎంతో అవసరమని రెండు దేశాలు స్పష్టంచేశాయి.
- ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో ప్రాంతీయ వ్యవహారాలపై విధానపరసహకారం అంశాన్ని కూడా ఉమ్మడి ప్రకటనలో చేర్చారు. ముఖ్యంగా ఈస్ట్ ఏసియా సమిట్ (ఈఏఎస్), ఆసియాన్ రీజనల్ ఫోరం(ఏఆర్ఎఫ్), సౌత్ ఈస్ట్ ఏసియాలో పైరసీకి వ్యతిరేకంగా ఆర్ఈసీఏఏపీ ఏర్పాటు.
- రెండు దేశాల రక్షణ మంత్రిత్వశాఖ, విదేశాంగ కార్యాలయంతో పాటు సాయుధ దళాల మధ్య కూడా తరచూ ద్వైపాక్షిక, బహుముఖ స్థాయిలో సంప్రదింపులు కొనసాగుతుండాలి.

ఉమ్మడి ప్రకటన ప్రాధాన్యం:

ఆసియాలో ఆర్థిక, రాజకీయ బలాబలాలు మారుతున్న తరుణంలో ప్రాంతీయ భద్రత పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ సమతుల్యత సాధనలో కొన్ని ముఖ్య ఆసియా దేశాల మధ్య వ్యూహాత్మక సహకారం చాలా అవసరం. ప్రాంతీయంగా ప్రజాస్వామ్య విలువలు, మానవహక్కులు, చట్ట

న్యాయాన్ని భారత్–జపాన్ ఉమ్మడి ప్రకటన ప్రతిబింబించింది. భారత్‌తో భద్రత సహకారం చాలా ముఖ్యమని జపాన్ ప్రధాన మంత్రి టారోఅసో అభిప్రాయపడ్డారు. తమ రెండు దేశాల భద్రత సహకారానికి చైనా వంటి మూడో దేశం ఎంతమాత్రం లక్ష్యం కాదన్నారు. భారత ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. తన వ్యూహాత్మక భాగస్వామ్య విధానానికి భారత్ కీలకమని జపాన్ భావిస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. భద్రత సహకార పత్రంపై జపాన్ సంతకాలు చేసిన దేశాల్లో అమెరికా, ఆస్ట్రేలియా తర్వాత భారత్ మాత్రమే కావడం విశేషం.

ఆర్థిక సహకారం:

- ఢిల్లీ–ముంబయిల మధ్య 1,468 కిలోమీటర్ల ఫ్రయిట్ కారిడార్ ఏర్పాటుకు 4.5 బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు జపాన్ అంగీకరించింది.
- సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందా(సీఈపీఏ)నికి తుదిరూపు ఇచ్చేందుకు భారత్, జపాన్ కృషి చేస్తున్నాయి. వ్యవసాయం, ఫార్మాస్యూటికల్ రంగాల విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి.
- అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ అభివృద్ధికి, నిర్వహణకు డబ్ల్యూటీవో దోహా రౌండ్ చర్చలు సాధ్యమైనంత త్వరగా ముగియడం ఒక్కటే పరిష్కారమని ఉమ్మడి ప్రకటన పేర్కొంది.
- ద్వైపాక్షిక సంబంధాలకు అత్యంత కీలకమైన ఆర్థిక సహకారం పూర్తి స్థాయిలో పటిష్టమవ్వాల్సి ఉందని భారత విదేశాంగ కార్యదర్శి అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక సంబంధాలను నిర్ణయించడంలో రాజకీయ, భద్రత సహకారానిది రెండో స్థానం.

వ్యూహాత్మక చర్చలు.. మూడో రౌండ్:

భారత్, జపాన్ విదేశాంగ మంత్రులు ఎస్.ఎం.కృష్ణ, హిరోఫుమినకాసోని 2009, జూలై 3న జపాన్ రాజధాని టోక్యోలో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య మూడో రౌండ్ వ్యూహాత్మక ద్వైపాక్షిక చర్చల కోసం ఈ భేటీ జరిగింది. ఇరు దేశాల మధ్య ఇలాంటి సమావేశాలు ప్రతి ఏటా జరుగుతున్నాయి. అంతర్జాతీయంగా, ద్వైపాక్షికంగా తమ మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు రెండు దేశాలు అంగీకరించాయి. భారత్‌లో ఫ్రైయిట్ కారిడార్, ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు మరింత అంకితభావంతో కృషి చేయాలని రెండు దేశాలు నిర్ణయించాయి. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై సంతకాల విషయంలో ఎలాంటి గడువు విధించుకోలేదు. పరస్పరం ప్రయోజనం చేకూర్చేలా ఆ ఒప్పందం ఉండాలని భావిస్తున్నాయి. పైరసీకి వ్యతిరేకంగా సహకారం, సముద్ర తీర భద్రతపై ద్వైపాక్షిక చర్చలు త్వరలో ప్రారంభంకానున్నాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధంపైనా దృష్టిసారించనున్నారు. అణు పరీక్షలపై భారత వాలంటరీ మారటోరియాన్ని అభినందించిన జపాన్.. త్వరలోనే సీటీబీటీపై కూడా సంతకం చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేసింది. ఫిసైల్ మెటీరియల్ కట్

ఆఫ్ ట్రీటీ(ఎఫ్ఎంసీటీ) అంశంలోనూ భారత్ సహకరిస్తుందని జపాన్ ఆశిస్తోంది. అణు నిరాయుధీకరణపై జరిగే నిర్మాణాత్మక చర్చల్లో పాలుపంచుకుంటామని భారత్ హామీ ఇచ్చింది. పర్యావరణ సమస్యకు సముచితమైన పరిష్కారం అవసరమని భారత్ భావిస్తోంది. ఈ అంశంపై ద్వైపాక్షిక చర్చలను వేగవంతం చేయాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

దీర్ఘకాలిక వ్యూహం:

దేశ రాజ్యాంగాన్ని సవరించి.. జపాన్ కూడా సాధారణ దేశంలా ఆసియా ప్రాంతంలో భద్రత బాధ్యతల్లో పాలుపంచుకునేలా చూడాలని ఆ దేశం కోరుకుంటున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆసియాలోని ఇతర దేశాల్లా కాకుండా జపాన్‌తో భారత్‌కు ఎలాంటి వివాదాలు లేకపోవడంతో ఆ దేశ ఆలోచనలను భారత్ స్వాగతిస్తోందని వారంటున్నారు. అదేసమయంలో చైనా శక్తిమంతదేశంగా ఎదుగుతున్న నేపథ్యంలో.. జపాన్ దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు కదులుతోందని మరికొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఆ వ్యూహంలో భాగమే భారత్‌తో రాజకీయ, భద్రత సహకారమని అంటున్నారు!!